క్లుప్తంగా

గేట్ విద్యార్థులకు ఉద్యోగాలు



తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి సమీపంలోని చిగురువాడలో ఉన్న గేట్ విద్యాసంస్థలో శుక్రవారం క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. ఎంఫాసిస్ కంపెనీ ప్రతినిధులు వివిధ దశల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి 33 మందిని ఆ సంస్థలో ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వారిని కళాశాల కరస్పాండెంట్ తమ్మినేని వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ మూర్తి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రణీత్‌కుమార్ తదితరులు అభినందించారు.

యాత్రికుడి ప్రాణాలు కాపాడిన 'మారుతి' వైద్యులు



బాధితులతో మారుతి వైద్యుల బృందం

తిరుపతి తుడా: తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చి అస్వస్థతకు గురైన హైదరాబాద్‌కు చెందిన భక్తుడికి శ్రీ మారుతి ఆసుపత్రి వైద్యులు సకాలంలో చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. ఆసుపత్రి అధినేత డాక్టర్ ఎం మారుతీకృష్ణ శనివారం మీడియాతో మాట్లాడుతూ భక్తుడు శుక్రవారం తిరుమల వెళ్లేందుకు తిరుపతి చేరుకున్నాడని తెలిపారు. గుండె పోటు రావడంతో కుటుంబ సభ్యులు తమ ఆసుపత్రికి తీసుకువచ్చారని తెలిపారు. గుండె వైద్య నిపుణులు డాక్టర్ పి.చంద్రశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో పరీక్షలు చేయగా రక్తనాళాలు బ్లాక్ అయినట్లు తేలిందన్నారు. వెంటనే యాంజియోప్లాస్టీ సర్జరీ చేసి ప్రాణాలను కాపాడినట్లు వెల్లడించారు.

కెనడా కవితల పోటీల విజేత పేరూరుకు సత్కారం



తిరుపతి కల్చరల్: కెనడా డే తెలుగు తల్లి పత్రిక-2023 ఆధ్వర్యంలో నిర్వహించిన కవితల పోటీల్లో బహుమతి పొందిన రచయిత పేరూరు బాలసుబ్రమణ్యంను తెలుగు భాషోద్యమ సమితి నేతలు శనివారం ఘనంగా సత్కరించారు. కరకంబాడి రోడ్డులోని బ్యాంక్ కాలనీ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. తెలుగు భాషోద్యమ సమతి నేతలు సాకం నాగరాజు, నాదేండ్ల శ్రీమన్నారాయణ, రచయితలు, సాహితీవేత్తలు మల్లీశ్వరరావు, దామోదరం, క్రిష్ణవేణి, వాకా ప్రసాద్, తమటం రామచంద్రారెడ్డి, శశిధర్ రాజు, మునిసిద్దారెడ్డి పాల్గొన్నారు.

హనుమంతునిపై ఊరేగిన సుందరరాజస్వామి



తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో సుందరరాజస్వామి అవతారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి స్వామి వారు హనుమంత వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం స్వామికి నిత్యకైంకర్యాలు చేశారు. మధ్యాహ్నం శ్రీకృష్ణ స్వామి ముఖమండపంలో స్నపన తిరుమమంజనం చేశారు. సాయంత్రం ఉభయదేవేరులతో కలిసి స్వామి ఊంజల్‌పై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి హనుమంతుడిపై కొలువుదీరి ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించారు.

నేడు గరుడ వాహన సేవ:
అవతారోత్సవాల్లో భాగంగా చివరి రోజైన ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు అభిషేకం, సాయంత్రం 5 గంటలకు ఊంజల్ సేవ, రాత్రి గరుడ వాహన సేవ జరుగనుంది.

ఘనంగా నల్లారెడ్డి వర్ధంతి



అన్నదానం చేస్తున్న నాయకులు

తిరుపతి గాంధీ రోడ్: బీజేపీ మొట్టమొదటి జిల్లా అధ్యక్షుడు నల్లారెడ్డి వర్ధంతిని శనివారం నగరంలోని గోవిందరాజు స్వామి ఆలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నేతలు చంద్రారెడ్డి, గుండాల గోపీనాథ్ రెడ్డి, అక్కినపల్లి మునికృష్ణ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అన్నదానం చేశారు.

ఉచిత ట్యూషన్ సెంటర్ ప్రారంభం

తిరుపతి కల్చరల్: మేక్ మై బేబీ జీనియస్ స్కూల్లో ఏర్పాటు చేసిన భగత్ సింగ్ ఉచిత ట్యూషన్ సెంటర్‌ను శనివారం డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.జయచంద్ర, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పిల్లల ఆలోచనలకు పదును పెట్టడంతోపాటు అనుమానాలను నివృత్తి చేసి విజ్ఞానాన్ని పెంపొందించే దిశగా ఉచిత ట్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు.

రైతును రాజును చేసిన వైఎస్సార్



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కట్టాగోపీ యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు

తిరుపతి తుడా: పలు సంక్షేమ పథకాలతో రైతును రాజును చేసిన మహోన్నత వ్యక్తి వైఎస్.రాజశేఖరరెడ్డి అని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. అందు కే ఆయన రైతులు, పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. తిరుపతి నెహ్రూనగర్‌లో శనివారం వైఎస్సార్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయ్ రెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి భారీ కేకును కట్ చేసి పంచిపెట్టారు. పేదలకు అన్నదానం చేశారు. అనంతరం భూమన మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌కు తిరుపతిపై ఎనలేని ప్రేమ, విడదీయరాని అనుబంధం ఉందని గుర్తు చేశారు. వెంకటేశ్వర వెటర్నరీ వర్సిటీ, వేద వర్సిటీతో పాటు తిరుపతి అభివృద్ధికి స్పెషల్ గ్రాంట్, టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, జిల్లాకు ఆదాయ వనరుగా శ్రీసిటీ, తుడాకు భూ బ్యాంక్ వంటి అనేక ప్రాజెక్టులు మంజూరు చేశారని తెలిపారు. ఆయన అడుగుజాడల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నడుస్తున్నారని చెప్పారు. నాయకులు పాలగిరి ప్రతాప్ రెడ్డి, టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ నైనారు మధుబాల, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్‌కేబాబు, రామస్వామి వెంకటేశ్వర్లు, వెంకటేష్ రెడ్డి, గంగమ్మ గుడి అలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, జేసీఎస్ జిల్లా అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, ఎంఎంఆర్ మునిరామిరెడ్డి పాల్గొన్నారు.

జనం గుండెల్లో నిలిచిన మహనీయుడు వైఎస్సార్

తిరుపతి కల్చరల్: అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడు వైఎస్సార్ అని డాక్టర్ వైఎస్ఆర్ ప్రజాప్రస్థానం సేవా ట్రస్ట్ చైర్మన్ పీసీ.రాయలు కొనియాడారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా డీఆర్ మహల్ సర్కిల్‌లో పేదలకు అన్నదానం చేశారు. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబు, కార్పొరేటర్ కోటూరి ఆంజనేయులు, ట్రస్ట్ డైరెక్టర్ రుద్రరాజు శ్రీదేవి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర సభ్యుడు రావూరి ప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుల గుండె చప్పుడు వైఎస్సార్

భాకరాపేట: రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలుచేసి వారి గుండెలో స్థిర స్థాయిగా నిలిచిన మహోన్నత వ్యక్తి వైఎస్సార్ అని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొండారెడ్డి, గృహసారథుల మండల కన్వీనర్ ఖదీర్‌అహ్మద్ తెలిపారు. శనివారం చిన్నగొట్టిగల్లులోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలల వేసి రైతు దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు అక్బర్, సర్పంచ్ మనోహర్, మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, రఫీ, ఇర్షాద్, లోకనాథరెడ్డి, బావాజీ, డమరకనాథగుప్త పాల్గొన్నారు.

అహ్మదాబాద్‌లో వైఎస్సార్‌కు నివాళి

తిరుపతి తుడా: గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరుగుతున్న అంతర్జాతీయ అర్బన్- 20 సమ్మిట్‌లో తిరుపతి మేయర్ శిరీష పాల్గొన్నారు. శనివారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ అమలు చేసిన పథకాలు, తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను వివరించారు. అనంతరం విశాఖ మేయర్‌తో పాటు సమ్మిట్‌కు వచ్చిన దేశవిదేశాల ప్రముఖులతో కలిసి వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

పేదలకు అన్నదానం

తిరుపతి కల్చరల్: వైఎస్సార్ జయంతి జయంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు ఆధ్వర్యంలో శనివారం రుయా ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బర్డ్ హాస్పిటల్ డైరెక్టర్ రెడ్డెప్పరెడ్డి, నేతలు రామచంద్రయ్య, బాల, రాజేష్, సోము, ప్రసాద్, ప్రవీణ్, నాగేంద్ర పాల్గొన్నారు.



వైఎస్సార్ చిత్రపటానికి పూలతో అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే భూమన, డిప్యూటీ మేయర్లు

పేదలకు స్వీట్లు పంపిణీ

తిరుపతి కల్చరల్: మహానేత వైఎస్సార్ జయంతి సందర్భంగా వైఎస్ఆర్ వీరాభిమాని బొమ్మగుంట రవి ఆధ్వర్యంలో బొమ్మగుంట వద్ద 75 కేజీల స్వీట్లను పేదలకు పంచిపెట్టారు.

ప్రజా శ్రేయస్సు కోసం తపించిన మహానేత వైఎస్ఆర్

తిరుపతి కల్చరల్: ప్రజల శ్రేయస్సు కోసం తపించిన మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి అని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం కొనియాడారు. స్థానిక ఎమ్మెల్సీ కార్యాలయంలో శనివారం వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం,

ఎస్వీయూలో వైఎస్సార్‌కు నివాళి

తిరుపతి ఎడ్యుకేషన్: దివంగత నేత వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతిని ఎస్వీయూలో శనివారం వైఎస్సార్ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.మురళీరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, వీసీ కే.రాజారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, గౌతమి, లోకేష్, గౌరీ, ప్రేమ్‌కుమార్, సుబ్రమణ్యం, అజీం, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మంగళం రణధీర్‌పురంలో..

తిరుపతి తుడా: మంగళం పరిధిలోని రణధీర్‌పురంలో శనివారం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. రణధీర్ పురం పంచాయతీ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణ, సప్తగిరి కాలనీ పంచాయతీ ఇన్‌చార్జి అశోక్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



రామచంద్రాపురం: కేక్ కట్ చేస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



ఎస్వీయూలో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తదితరులు



వైయస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చంద్రగిరిలో..

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలో వైఎస్సార్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద మహానేతకు నివాళులర్పించారు. పలుచోట్ల అన్నదానం చేశారు. అలాగే తిరుపతి రూరల్ మండలం సీగొల్లపల్లిలో వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌కు నివాళులర్పించారు. పుదిపట్ల పంచాయతీలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, సుబ్రమణ్యంనాయుడు, బడి వెంకటేష్‌యాదవ్, గోపి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. పెరుమాళ్లపల్లిలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొత్తపాటి మునీశ్వర్‌రెడ్డి, సర్పంచ్ జోగిమోహన్, పార్టీ అధ్యక్షుడు గుణశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

వైఎస్సార్‌కు నివాళి

పాకాల: దామలచెరువు సంతగేటు ప్రాంగణంలో శనివారం వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంతలో రైతులు, వ్యాపారులు, పేద ప్రజలకు అన్నదానం చేశారు. ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజాబాబురెడ్డి, కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, సర్పంచ్ సునిత, ఎంపీటీసీ గౌతమి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం: మండలంలోని నెన్నూరులో శనివారం వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతిని వైఎస్సార్ సీపీ నేతలు ఘనంగా జరుపుకున్నారు. వైఎస్సార్ విగ్రహానికి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులతో కలిసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు.



మన్నసముద్రం రైతు ఏక్‌చంద్రను సత్కరిస్తున్న కలీముల్లా తదితరులు



పేదలకు అన్నదానం చేస్తున్న పీసీ.రాయలు



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న మేయర్ శిరీష



పేదలకు అన్నదానం చేస్తున్న పోకల అశోక్‌కుమార్, మల్లారపు మధు



చంద్రగిరిలో అన్నదానం చేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



పేదలకు స్వీట్లు పంచిపెడుతున్న బొమ్మగుంట రవి, వైఎస్ఆర్ అభిమానులు

రైతు బాంధవుడు వైఎస్సార్



అనంతగుర్రప్పగారి పల్లి ఆదర్శ రైతును సత్కరిస్తున్న ఎస్వీ వ్యవసాయ కళాశాల అధ్యాపకులు తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో శనివారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరిశోధనా స్థానం ఇన్‌చార్జ్ సహ పరిశోధనా డైరెక్టర్ ఎస్.కలీముల్లా దత్తత గ్రామం మన్నసముద్రంలో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో సుమారు 25 ఎకరాల్లో వరి, వేరుశనగ సాగు చేస్తూ అధిక దిగుబడి సాధిస్తున్న రైతు చెరుకునూరు ఏక్‌చంద్రను సత్కరించి, ప్రశంసా పత్రం, 2023-24వ వ్యవసాయ పంచాంగం, జీవన ఎరువులను అందించారు.

వ్యవసాయ కళాశాలలో..

వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో వైఎస్సార్ జయంతి సందర్భంగా రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ జి.ప్రభాకర్‌రెడ్డి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల దత్తత గ్రామమైన అనంతగుర్రప్పగారిపల్లి అభ్యుదయ రైతులు నాగరాజనాయుడు, భానుప్రకాష్‌ను ఘనంగా సత్కరించారు.

ఎస్వీ పశు వైద్య వర్సిటీలో..

ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని నిరంతర పశువైద్య విద్య-సమాచార కేంద్రంలో వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం

- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- నెహ్రూనగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం

తిరుపతి తుడా: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాలను తీసుకువచ్చి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని, రైతులకు వివిధ సంక్షేమ పథకాలను అమలుచేస్తూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి కలలుగన్న రాజన్న రాజ్యాన్ని తీసుకువచ్చారని ఎమ్మె ల్యే భూమన కరుణాకరరెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం తిరుపతి నెహ్రూనగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం నుంచి వారు పొందిన సంక్షేమ పథకాలు, లబ్ధిని వివరించారు. పలు పథకాల ద్వారా ప్రతి కుటుంబానికీ రూ.9 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు లబ్ధి చేకూరిందని తెలిపారు. మంచి చేసిన వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. చంద్రబాబు ప్రభుత్వంలో 10 శాతం మంది ప్రజలకు కూడా లబ్ధి చేకూరలేదన్నారు. అధికారం కోసం 650కు పైగా హామీలను ఇచ్చి ప్రజల్ని నమ్మించి గద్దెనెక్కాక మోసం చేశారని దుయ్యబట్టారు. జగనన్న పాదయాత్రలో ప్రజల బాధలు తెలుసుకుని నవరత్న పథకాలకు రూపకల్పన చేశారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలను అమలుచేశారని గుర్తు చేశారు. ఒకేసారి 1.30 లక్షల ఉద్యోగాలు ఇచ్చిన ఘన చరిత్ర జగనన్నది అని కొనియాడారు. 3.5 లక్షల మందికి పైగా వార్డు వలంటీర్ల ద్వారా గడప వద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు ఇన్ని జిమ్మిక్కులు చేసినా ఇక అధికారంలోకి రావడం కలేనన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు కల్పనా యాదవ్, దూదికుమారి, వక్ఫ్‌బోర్డు మెంబర్ ఇమ్రాన్, నాయకులు పాలగిరి ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన

శ్రీవారి సేవలో ప్రముఖులు



క్రికెట్ ప్లేయర్లు రాబిన్ ఊతప్ప, ఆర్పీ సింగ్

తిరుమల: శ్రీవారిని శనివారం బీసీ కమిషన్ చైర్మన్ శంకర్ నారాయణ, ప్రముఖ క్రికెట్ ప్లేయర్లు రాబిన్ ఊతప్ప, ఆర్పీ సింగ్, తెలంగాణ ప్రభుత్వ విప్ ఎమ్మెస్ ప్రభాకర్‌రావు ఉన్నారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో ప్రముఖులను పండితులు వేద ఆశీర్వదించారు. అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

దేవరకొండపై విశేష పూజలు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండపై వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు చేశారు. ఉదయం స్వామికి అభిషేకం చేశారు. ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

యువతకు మార్షల్ ఆర్ట్స్ విద్య అవసరం

చంద్రగిరి(తిరుపతి రూరల్): యువతకు మార్షల్ ఆర్ట్స్‌ను నేర్పించడం ఎంతో అవసరమని తిరుపతి అడిషనల్ ఎస్పీ వెంకట్రావు తెలిపారు. చంద్రగిరిలోని ఒక ప్రైవేటు హోటల్‌లో శనివారం న్యూ మాంక్స్ తాయ్-చి కుంగ్-ఫు ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ విద్య అనేది భౌతిక మానసిక, ఆధ్యాత్మిక యుద్ధ కళని తెలిపారు. ఈ విద్య లోతైన శ్వాసను ప్రోత్సహిస్తుందని, రక్త ప్రసరణను మెరుగుపరచడంలో కీలకంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఈ ఆర్గనైజేషన్ ద్వారా తిరుపతిలో సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. అనంతరం నిర్వాహకులు అడిషనల్ ఎస్పీ వెంకట్రావ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎస్పీ డేవిడ్, జనరల్ సెక్రటరీ దినేష్, హీరా కళాశాల మేనేజర్ అజీజ్, అడ్వకేట్ దామోదర్, కుంగ్ ఫు మాస్టర్ జీవీ రాఘవ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ వెంకట్రావు

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

రామచంద్రాపురం: మండలంలోని ప్రజలందరూ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి కోరారు. ఆయన శనివారం సొరకాయల పాళెం, కమ్మపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల ఆవరణలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను పరిశీలించారు. వైద్య పరీక్షలు చేయించుకుని ముందు జాగ్రత్తలు తీసుకుంటే రోగాల నుంచి బయట పడవచ్చన్నారు. ఈసీజీ, షుగరు, బీపీ, కిడ్నీ, లివర్, థైరాయిడ్, కొలెస్ట్రాల్ వంటి 43 రకాల టెస్టులను ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, ఎంపీడీఓ మహ్మద్ రఫీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, బాబుయాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధమునిరెడ్డి, భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

అడ్డదారిలో తిరుమలకు నకిలీ టీవీల వ్యాపారులు

తిరుమల: నకిలీ టీవీలు విక్రయించే వ్యాపారులు ఇద్దరు తిరుమలకు ఎలా వెళ్లాలో తెలియకుండా కొండ పైనుంచి తిరుపతికి వాహనాలు వచ్చే మొదటి ఘాట్ రోడ్డు మీదుగా చేరుకున్నారు. ఆ మార్గంలో మూడు చోట్ల తనిఖీ కేంద్రాలున్నా సిబ్బంది కళ్లుగప్పి కొండపైకి వచ్చేశారు. తిరుమల టూటౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ చంద్రశేఖర్ కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహమ్మద్ ఆసిఫ్, షెహనాజ్ స్థానికంగా తయారుచేసిన టీవీలకు ప్రముఖ కంపెనీల స్టిక్కర్లు వేసి అమ్ముతుంటారు. శనివారం తిరుపతి అలిపిరి వద్దకు చేరుకున్నారు. తిరుమలకు ఏవిధంగా చేరుకోవాలో తెలియకుండా మొదటి ఘాట్ రోడ్డులోని తనిఖీ కేంద్రం మీదుగా కొండకు బయలుదేరారు. ఈ మార్గంలో అలిపిరి వద్ద, శ్రీవారి మోకాలు మెట్టు, అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద మూడు తనిఖీ కేంద్రాలు ఉన్నాయి. వాటిని దాటుకుని తిరుమల జీఎన్సీ టోల్ గేట్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలో తెలియక సిబ్బందిని ఇక్కడ ఏ ఊరు ఉంది.. ఎలా వెళ్లాలి అడిగారు. దీంతో సిబ్బంది వారిని విచారించారు. అనుమానం వచ్చి సమీపంలోని ట్రాఫిక్ పోలీసులను పిలిచి వారి ద్వారా తిరుమల విజిలెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. విజిలెన్స్ సిబ్బంది వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. అనంతరం తిరుమల టూటౌన్ పోలీసులకు అప్పగించగా వారు నకిలీ టీవీలు అమ్మేందుకు వచ్చినట్లు గుర్తించి తిరుపతి ఈస్ట్ పోలీసులకు అప్పగించారు. ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గదిని అద్దెకు తీసుకుని అందులో లోకల్ టీవీలను ఉంచి ఊరూరూ తిరుగుతూ విక్రయిస్తున్నట్టు గుర్తించారు. దీనిపై ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేయనున్నారు.



మొదటి ఘాట్ రోడ్డు మీదుగా తిరుమల చేరుకున్న నకిలీ టీవీలు విక్రయించే వ్యక్తులు

ఘాట్‌రోడ్డులో కారు ప్రమాదం

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో శనివారం ఓ కారు ప్రమాదానికి గురైంది. చెన్నైకి చెందిన భక్తులు కారులో శుక్రవారం తిరుమలకు చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకుని శనివారం సాయంత్రం మొదటి ఘాట్ రోడ్డుమీదుగా కిందకు దిగుతుండగా వినాయకస్వామి ఆలయం దాటగానే డ్రైవర్ కునుకు తీశాడు. కారు అదుపుతప్పి రోడ్డుకు పక్కన అటవీ ప్రాంతంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



ఘాట్ రోడ్‌లో ప్రమాదానికి గురైన కారు

రెడ్డివారిపల్లి వద్ద కొనసాగుతున్న ఉద్రిక్తత

చంద్రగిరి (తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం రెడ్డివారిపల్లి వద్ద ఉద్రిక్తత కొనసాగుతోంది. లీజు లేకపోయినా ఇసుకను తరలిస్తున్న వాహనాలను స్థానికులు అడ్డుకుంటున్నారు. ప్రైవేటు సంస్థకు చెందిన వారు స్థానికులపై దౌర్జన్యానికి దిగారు. లీజు పత్రాలు చూపకుండానే వాహనాలను స్వర్ణముఖి నదిలోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. సింగిల్‌విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, స్థానికులు అడ్డుకోవడంతో వారిపై దౌర్జన్యం చేశారు. దీంతో స్థానికులు రోడ్డుకు అడ్డంగా బైఠాయించి నిరసన తెలిపారు. ఇసుకాసురులు, మైనింగ్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దౌర్జన్యం చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రగిరి సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. న్యాయం చేయాలని చంద్రమౌళిరెడ్డి పోలీసుల కాళ్లు పట్టుకుని వేడుకున్నారు.